

విద్యుత్ బిల్లుల దగ్ధం

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యాన అల్లూరి జిల్లా అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ బిడ్డగుడ గ్రామంలో గురువారం విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం తగదన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ బిల్లులు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టాక ఛార్జీలు పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.స్మార్ట్ మీటర్లు ఎవరి కోసం పెడుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు కె.అర్జున్, ఎస్.పండు, జి.భీమన్న, ఎస్.రాజు, కె.పోతన్న, కె.బుచ్చన్న, అప్పారావు పాల్గొన్నారు.



బిల్లులు దగ్ధం చేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

- జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ - ప్రజా దర్బార్‌కు స్పందన

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో రాష్ట్ర జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా తమ తమ గ్రామాలలో సమస్యల పై ప్రజలు రాష్ట్ర జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పెదబయలు మండలం గోమంగి పంచాయతీ కుమ్మరివీధి గ్రామంలో సీసీ రోడ్డు, గోమంగి గ్రామంలో మెయిన్ రోడ్డుకు అనుకుని కిలోమీటర్ బీటి రోడ్డు, గోమంగి హాస్పిటల్ నుండి కరుగొండ వరకు మూడు కిలోమీటర్లు బీటి రోడ్డు మంజూరు చేయాలని పలువురు కోరారు. డుంబ్రిగుడ మండలం కించుమండ పంచాయతీ కుసుమవలస, చింతపల్లి మండలం తమ్మెంగుల పంచాయతీ కె.ఎస్ దుర్గం గ్రామంలో విద్యార్థులు చదువుకుంటున్నారని స్కూల్ భవనం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని స్కూల్ భవనం మంజూరు చేయాలనీ కోరారు. హుకుంపేట మండలం మత్స్యపురం పంచాయతీ పెదబూరుగు గ్రామంలో డ్రైనేజీ కాలువ మంజూరు చేయాలని, హుకుంపేట మండలం సంతారి పంచాయతీ కడబీరు గ్రామంలో రామాలయం ఆలయం మంజూరు చేయాలని విన్నవించారు. అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పెదకోట గ్రామంలో జంప్రంగి దేముడు పట్టాలో పేరు నమోదు చేయాలనీ వినతి పత్రాలు అందజేశారు.

అనంతరం రాష్ట్ర జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ. వినతులను సంబందిత అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించాడనికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శెట్టి లక్ష్మణుడు, మాజీ జీసీసీ ఛైర్మన్ ప్రసాద్, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు హుకుంపేట మండల అధ్యక్షులు కొర్ర తులసిరావు, శోభకోట సర్పంచ్ పలాసీ శశి భూషణం నాయుడు, అండీభ సర్పంచ్ తమర్ల సత్యనారాయణ, హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమ, అడ్డుమాండ ఎంపీటీసీ శెట్టి మహేష్, గూడ సర్పంచ్ కంబిడి జ్ఞాన ప్రకాష్ మాజీ సర్పంచులు జంప్రంగి దేముడు, పెల్లమల రామలింగం,కొర్ర వాసుదేవరావు,అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నెగెల సుందర్. క్లస్టర్ ఇంచార్జి రూడి త్రినాధ్, అరకు పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి సాగర సత్యవతి, కిముడు మహేశ్వరీ, హుకుంపేట బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గంజాయి గంగరాజు, టీడీపీ నాయకులు మేఘరాజు, వెంకట్ మురళి సాగర్, రవీంద్ర, రాజు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కిడారి

నిర్వాసితుల పక్షాన సిపిఎం పోరాటం

● మండల మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి : కూనవరం : అధికారంలోకి వచ్చిన ప్రతి పార్టీ పోలవరం ప్రాజెక్టు, కాపర్ డ్యాం కోసం ఆలోచిస్తున్నాయే తప్ప, నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ, వారి కష్టనష్టాలను ఏఒక్కరూ పట్టించు కోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. నిర్వాసితుల పక్షాల వారి కోసం ఆది నుంచి ఎర్రజెండా నీడన సిపిఎం పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. గురువారం మండలంలోని రేపాక గ్రామంలో సిపిఎం 9వ మండల మహాసభను అధ్యక్షులు కొమరం పెంటయ్య, పొడియం రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు తలగాని నాగరాజు ఆవిష్కరించారు అనంతరం ప్రజా నాట్యమండలి కళాకారుల లాల్‌సలాం కామ్రేడ్ అనే గేయంతో సభను ప్రారంభమైంది.



మండల మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ పోలవరం ముంపు వాసుల సమస్యలపై సిపిఎం మహా పాదయాత్ర చేసిందన్నారు. అధికారంలోకి వస్తే పోలవరం బాధితులు, నిర్వాసితులకు న్యాయం చేస్తామన్న పార్టీలు తర్వాత మరిచిపోయాయన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో చాప కింద నీరులా మతోన్మాద బిజెపి విస్తరిస్తోందన్నారు. వీరికి రాష్ట్రంలో అధికార టిడిపి, జనసేనతోపాటు విపక్ష వైసిపి కొమ్ముకాస్తోందన్నారు ఇలాంటి పరిస్థితుల్లో మన్యంలో బిజెపి ఓటమిలో సిపిఎం క్రియాశీలపాత్ర పోషించింద న్నారు. మన్యంలో ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి సిపిఎం అనునిత్యం పోరాటం చేస్తోందన్నారు. ఏజెన్సీలో యువతకు ఉద్యోగాఉల, పోడుభూములకు సాగుహక్కు పట్టాలు, ఇతరత్రా సమస్యల పరిష్కారంలో సిపిఎం ముందంజలో ఉందన్నారు.

కక్ష, వివక్షపూరిత రాజకీయాలు చేస్తున్న అధికార విపక్షాలకు ప్రజల సమస్యలు పట్టడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, మర్లపాటి నాగేశ్వరావు, సీసం సురేష్, విఆర్ పురం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, ఆవుల ఉపేంద్ర, మురళి, ఎంపిటిసిలు అమ్మాజీ, జయసుధ, సర్పంచ్‌లు నాగమణి, వెంకమ్మ, రామారావు, శంకర్, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా బొర్రయ్య



రేపాకలో నిర్వహించిన సిపిఎం మండల మహాసభలో మండల కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కార్యవర్గంలో మండల కార్యదర్శిగా బాబు బొర్రయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులుగా పాయం సీతా రామయ్య, మేకల నాగేశ్వర రావు, కొమరం పెంటయ్య, మడకం నాగమణి, సభ్యులుగా ఆవుల ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు, పొడియం రామారావు, తెల్లం తమ్మయ్య, తాళ్లూరి శ్రీనివాసారావు, పాయం సత్యనారాయణ, బొగ్గా సుబ్బయ్య, బొగ్గా రామారావు, మడెం బాబూరావులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు..

రోడ్లను త్వరితగతిన నిర్మించాలి

-ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పెదబయలు: రహదారుల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ ఆదేశించారు. గిరిజన గ్రామాలకు రోడ్లు, వంతెనలు నిర్మిస్తామన్నారు. మారుమూల గ్రామాల్లో గురువారం సుడిగాలి పర్యటన చేసారు. గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గిన్నెలకోట హైలెవెల్ వంతెనను పరిశీలించారు. వచ్చే సంక్రాంతి నాటికి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేస్తామన్నారు. చట్రకాయపుట్టు నుండి గండలం గ్రామానికి రోడ్డు నిర్మిస్తామన్నారు. తమలం గ్రామం వద్ద కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనులు పంపించాలని చెప్పారు. తమలం ఎంపిపి పాఠశాల ను సందర్శించారు.గ్రామస్తులు పాఠశాలకు ప్రహరీ గోడ మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డి.ఇ. ధృవకుమార్, ఎఇఇ రాము, జామిగుడ సర్పంచ్ వెంకటరావు, గిన్నెలకోట ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న పిఒ

చట్రాపల్లి బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

ఆదివాసీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షుడు చిన్నయ్యపడాల్
శారదా ట్రస్ట్ ఆధ్వర్యాన బాధితులకు రగ్గుల పంపిణీ



బాధితులకు రగ్గులు అందజేస్తున్న చిన్నయ్యపడాల్, ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు: వర్షాలు, వరదలతో అతలాకుతలమైన చట్రాపల్లి బాదిత కుటుంబాలకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టకుండా వదిలేయడం దుర్మార్గమని ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మండిపడ్డారు. బాధితులను ఆదుకుంటామని, అన్ని సౌకర్యాలతో మోడల్ కాలనీ నిర్మిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. గురువారం సిపిఎం గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ గెమ్మెల మల్లేశ్వరి ఆధ్వర్యంలో గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించారు. శారద ట్రస్ట్ ఆర్థిక సహాయంతో బాధితులకు 40 రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోనంగి. చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ చట్రాపల్లి బాధితులకు మోడల్ కాలనీ నిర్మిస్తామన్న హామీని తక్షనం అమలు చేయకుంటే చలో కలెక్టరేట చేపట్టి, ముట్టడిస్తామని హెచ్చరించారు. విపత్తు షెల్టర్‌కు రూ.మూడు కోట్లు నిధులుఅధికారులు ప్రకటించినప్పటికీ, ఇంకా ముందడుగు పడలేదని అసహనం వ్యక్తం చేశారు. బాధితు కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా నాయకులు గడుటూరి. సత్యనారాయణ, సోమలింగం, గ్రామ పెద్దలు, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

-జెడ్‌పిటిసి గంగరాజు




మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి– అనంతగిరి: గ్రామాల్లోని ప్రజల సహాయ సహకారంతోనే అభివృద్ధి జరుగుతుందని స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణిలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, సచివాలయం సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏవివి కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు, అధికారుల సమన్వయంతోనే మండలం అభివృద్ధి చెందుతున్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. అనంతరం డిఎల్పిఓ కుమార్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు మంజూరైన ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఖర్చు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు పక్కదారి పట్టించిన ప్రజా ప్రతినిధులు, అధికారులపై చట్ట పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే పలు పంచాయతీలలో అభివృద్ధి పనుల పేరిట నిధులు పక్కదారి పట్టినట్లు ప్రజలు తెలుపుతున్నారని, అటువంటి వారిపై ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిల్లో. మోస్య, రూతు, సన్యాసిరావు పాల్గొన్నారు.

అక్టోబర్, నవంబర్ నెలల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలంలోని సచివాలయ సిబ్బందికి అక్టోబర్, నవంబర్ జీతాలు చెల్లించాలని మండల పరిషత్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఇమ్మానియేల్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. అక్టోబరు, నవంబరు నెలల జీతాలు ఇప్పటివరకు తమ బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయలేదని 16 పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సచివాలయాల ఉద్యోగులకు జీతాలు చెల్లించినప్పటికీ, తమకు ఎందుకు చెల్లించలేదో అంతుపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలపైనే కుటుంబ పోషణ, ఇతర అవసరాలు ఆధారపడి ఉన్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు లేక పోవడంతో ఫీల్డ్ వర్క్‌కు వెళ్లాలంటే బైకుల్లో పెట్రోల్ వేసుకోలేని దుస్థితి ఏర్పడిందని సచివాలయ సిబ్బంది వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీతాలు బ్యాంక్ ఖాతాలో జమచేసేలా చర్యలు చేపట్టాలని వినతి పత్రం ద్వారా అధికారులు వద్ద వేడుకున్నారు. మండలంలో దేవరపల్లి, దామనాపల్లి , పేద వలస, సంకాడ, జెర్రీల, గుమ్మరేవులు, మొండిగెడ్డ, సీలేరు, దారకొండ ఒకటి రెండు సచివాలయాల ఉద్యోగులకు మాత్రమే అక్టోబర్,నవంబర్ నెలలో జీతాలు అందలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు.



మండల పరిషత్ ఎఒకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు



గృహాలను పరిశీలిస్తున్న పీడీ

గృహాలను వేగంగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి: పివిటిజి ప్రజలకు జన్మన్ పథకం కింద నిర్మిస్తున్న గృహాలు త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బాబునాయక్ సూచించారు. మండలంలో గురువారం కొండిభ. పంచాయతీ తోకవలస. నడమివలస, కొత్తూరు పంచాయతీ పరిది బెడ్డగుడ గ్రామాల్లో పర్యటించారు. పివిటిజి గిరిజనులు నిర్మించుకున్న గృహాలను స్వయంగా పరిశీలించారు పనులు త్వరితగతిన పూర్తి చేసినట్లయితే చెల్లించవలసిన బిల్లులు అందజేస్తామని లబ్ధదారులకు తెలిపారు. గృహాలు మంజరై పనులు ప్రారంభించని వారు ఎవరైనా ఉంటే వెంటనే పనులు మొదలుపెడితే బిల్లులు వారి ఖాతాలో జమ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ పి.నాగేశ్వరరావు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-గొలుగొండ: ద్విచక్ర వాహనదారులు తప్పనిరిగా హెల్మెట్ ధరించాలని కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు సూచించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు.వీటిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

మామిడిపల్లిలో విషాదం

- టీకాలు వేసిన కొద్ది గంటల్లో చిన్నారి మృతి

ప్రజాశక్తి - చింతపల్లి :- కొత్తపాలెం పంచాయతీ మామిడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో వేసిన వాక్సిన్ వికసించి చిన్నారి మృతి చెందింది.మండలంలోని కొత్తపాలెం పంచాయతీ మామిడిపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో బుధవారం ఆశా కార్యకర్త ఆధ్వర్యంలో సచివాలయ ఏఎన్ఎం చిన్నారులకు టీకాలు వేశారు. వారిలో రెండు నెలల 14 రోజుల చిన్నారికి ఆ వ్యాక్సిన్ చేసిన తర్వాత విపరీతమైన జ్వరం మొదలైంది. దీంతో తల్లిదండ్రులు ఏ ఎన్ ఎం కు ఫోన్ చేయగా పర్వాలేదని చెప్పారని, శ్వాస ఆడక పోవడంతో తల్లిదండ్రులు చిన్నారిని ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. దీంతో మామిడిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రత్యేక శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చింతపల్లి :- స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాలలో భాగంగా గురువారం ప్రారంభమైన మొదటిరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సర్పంచులు, మండల పరిధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై (సస్టైనబుల్ డెవలఫమెంట్ గోల్స్)12, 13 తేదీలలో నిర్వహించ తలపెట్టిన మొదటి విడత శిక్షణా కార్యక్రమాలలో భాగంగా వివిధ పంచాయతీల సర్పంచులు, మండల పరిధి అధికారులు, కార్యదర్శులు సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

నేడు 'రైతులకు అండగా వైసిపి'

ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ర్యాలీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రైతులకు అండగా వైసిపి ఆందోళనలో భాగంగా ఈ నెల 13న కలెక్టరేట్లు ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ్‌భాస్కర్, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సినిమా హాల్ సెంటర్ వద్ద విలేకర్లతో సమావేశంలో ఆందోళన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రైతులకు బాసటగా కలెక్టరేట్లు ముట్టడి చేపడుతున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతోపాటు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలంపై ఆందోళన చేపడతామన్నారు

గురువారం ఉదయం 10 గంటలకు కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి రామకృష్ణ, ఎంపిపిలు శ్రీదేవి, మురళి, వెంకటలక్ష్మి, పార్టీ అధ్యక్షులు రామన్న దొర, జిల్లా కార్యదర్శి వెంకటేష్ రాజు, గంగవరం జెడ్‌పిటిసి బేబీ, పల్లాల కృష్ణారెడ్డి, రఘు, సర్పంచులు మంగా బొజ్జయ్య, కొమరం పండు దొర, వడగలు ప్రసాద్, సర్పంచ్‌లు రామకృష్ణ, పండ నాగన్న దొర, తామెరుపల్లి ఆనంద రెడ్డి, వైస్ సర్పంచ్ కన్నబాబు, ఎంపిటిసి పాపారావు, ఉలవల లక్ష్మి, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురు కూలి రేట్లపై చర్చలు విఫలం

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మండలంలోని జిఎం వలస పంచాయతీలో వెదురు కూలీ రేట్లపై పంచాయతీ సర్పంచ్ కారం లక్ష్మి, గ్రామస్తులతో అటవీ అధికారుల చర్చలు విఫలమయ్యాయి. గురువారం జరిగిన చర్చల్లో కూలీరేట్లను పెంచడానికి అధికారులు సుముఖత చూపలేదు. మండలంలోని జిఎం వలస, కుండాడ పంచాయతీ పరిధిలో ఉన్న వెదురు బొంగులు నరకడానికి కూలి రేట్లు పెంచాలని అటవీ అధికారులతో చర్చలు జరపగా, ఒక్కో వెదురుబొంగు నరికేందుకు రూ.పది ఇవ్వాలని కూలీలు కోరగా, రూ.8కి మించి ఇవ్వలేమని అటవీ అధికారులు భీష్మించడంతో చర్చలు విపలయ్యాయి. దీనిపై కూలీలు స్పందిస్తూ, కూలీరేట్లు పెంచకుంటే సమ్మె సమ్మె కొనసాగిస్తామని కూలీలు గ్రామ స్తులు ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్ కారం లక్ష్మి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు బి శ్రీదేవి, కె.శాంతికుమారి ఎంపిటిసి సువర్ణరావు పాల్గొన్నారు.



చర్చల్లో మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మి

రహదారి మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి -చింతపల్లి : చౌటుపల్లి పంచాయతీ కేంద్రం నుండి పశువుల బంధ మీదుగా కొత్తపాలెం వెళ్లే రహదారిని మరమ్మతు చేపట్టలని తెదేపా సీనియర్ నాయకుడు బండి రమణ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ, చింతపల్లి నుండి జీకే వీధి మండలంలోని కొత్తపాలెం, జెర్రెల, మొండిగెడ్డ పంచాయతీలకు వెళ్లే ప్రధాన రహదారి గడచిన కొన్నేళ్లుగా పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా దర్శనమిస్తుందన్నారు. గతంలో చింతపల్లి నుంచి చౌడుపల్లి, పశువుల బంధ, కొత్తపాలెం మీదుగా జెర్రెల, మొండిగెడ్డ పంచాయతీ కేంద్రాల వరకు ఆర్‌టిసి బస్ తిరిగేదన్నారు.రోడ్డు అస్తవ్యస్తంతో ఆర్టీసీ సర్వీసును ఈ మార్గం గుండా కాకుండా రింతాడ, కడుగుల మీదుగా తిప్పుతున్నారన్నారు. దీంతో మార్గంలోని ప్రజలు ఆర్టీసీ సదుపాయానికి నోచుకోలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో కనీసం గోతులు పూడ్చిన దాఖలాలు లేవన్నారు. చౌడుపల్లి నుంచి కొత్తపాలెం వరకు అద్వానంగా ఉన్న రహదారిని మెరుగుపరచాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

గిరిజన విలేకర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షులు సూర్యారావు, కార్యదర్శి రాజు

ప్రజాశక్తి -హుకుంపేట: ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సేవా సంఘం డివిజన్ స్థాయి నూతన కార్యవర్గం ఎన్నికను సీనియర్ జర్నలిస్టు సి హెచ్ వి రమణ అధ్యక్షతన గురువారం అడరిమెట్ట బ్రిడ్జి వద్ద జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా పి.సూర్యారావు (ఏ ఐ ఆర్), వి.రాజు (10టివి)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె ఆనంద్(ప్రజాశక్తి) సహాయ కార్యదరి గా జి .కోటి బాబు (ప్రజాశక్తి), గౌరవ అధ్యక్షులుగా సిహెచ్ వి రమణ (సూర్య), వి.జ్యోషి (సాక్షి), పి.దేముడు బాబు (ప్రజాశక్తి), కె. దుర్గారావు (సాక్షి), కోశాధికారి గా టి. సునీల్ కుమార్ (లక్కిమిడియా సి ఇ ఓ), సహాయ కోశాధికారిగా ఎల్.ఉదయ్ కుమార్(ఆంధ్ర ప్రభ) లను ఏన్నుకోగా 16 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పడింది.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గోపాల్

బోరు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతపల్లి : తాగునీటి సమస్య పరిష్కారానికై జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో వేయిస్తున్న తాగునీటి బోర్‌లను సద్వినియోగం చేసుకోవాలని పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్ అన్నారు. ఆ పంచాయితీ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో బోరు నిర్మాణ పనులను పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు పొట్టిక లోవరాజు తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ ఉప సర్పంచ్ ఎం లోవరాజు, వార్డ్ సభ్యుడు పొట్టిక లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు

ఎయును సందర్శించిన టెక్సాస్ యూనివర్సిటీ ఆచార్యులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని టెక్సాస్ ఎ అండ్ ఎం యూనివర్సిటీ ఆచార్యులు సందర్శించారు. గ్రాడ్యుయేట్ స్టడీస్ విభాగం డీన్ టింగ్‌లు, పబ్లిక్ హెల్త్ విభాగం ప్రొఫెసర్ విజయ్ గొల్లా, ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సంయుక్తంగా పనిచేసే అంశంపై చర్చించారు. సంయుక్తంగా కోర్సులు నిర్వహణ పరిశోధనా రంగంలో కలిసి పనిచేయడం, తదితర అంశాలపై ప్రాథమిక చర్చలు జరిపారు. కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, ఆటిజం సంబంధించిన కోర్సుల నిర్వహించడానికి వీరు ఆసక్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్


జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 13 వ తేదీ నుండి జనవరి 10 వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ గురువారం వెల్లడించారు. జిల్లాలోని 22 మండలాల్లో 2969 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందన్నారు. గ్రామ సభలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిసాత్తరన్నారు. భూ సమస్యలు, మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతామన్నారు. గ్రామ స్థాయిలో స్వీకరించిన ఫిర్యాదులను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. తాహశీల్దారులు, మండల సర్వేయర్లు, వి.ఆర్.ఓలు ఆర్.ఐలు ఇతర రెవెన్యూ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు రెవెన్యూ సదస్సులకు హాజరు కావాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ సదస్సులలో పాల్గొంటారని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు మండల ప్రత్యేకాధికారులను నియమించామని చెప్పారు. డివిజన్ స్థాయిలో సబ్‌కలెక్టర్లును నియమించడం జరిగిందన్నారు. మ్యుటేషన్లకు ఎటువంటి ఫీజులు, డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలు రెవెన్యూ సదస్సులకు హాజరై భూ సమస్యలను పరిష్కరించు కోవాలని కోరారు.

డుంబ్రిగుడ: మండలంలో ఈనెల 13న శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నామని ఇన్చార్జి తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండల వాప్తంగా రెవెన్యూ గ్రామాల పరిధితో పాటు పంచాయతీ కేంద్రాల్లో రెండు పూటలా సదస్సులను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మ్యూటేషన్, చేర్పులు, మార్పులు, విస్తీరణ సవరణతో పాటు, భూ ఆక్రమణలపై ఆర్జీలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -అరకులోయ: మండల కేంద్రంలో గురువారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో చర్చి ఆఫ్ హెూలీ గాడ్ గ్రౌండ్స్ లో ఈ వేడుకలను నిర్వహించారు. ఐక్య క్రిస్మస్ వేడుకలకు విజయవాడ క్రైస్ట్ టెంపుల్ దైవజనుడు రెవరెండ్. పాల్ ఇమ్మానుయేలు వాక్య సందేశం అందించారు. మానవునిలో పాపాన్ని తీసివేయడానికి లోకానికి ఏసుక్రీస్తు వచ్చారన్నారు. చెడు మార్గాలను వదిలి మంచి మార్గంలో నడవాలన్నారు. విజయనగరం రీజియన్ ఏపీ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ, దేవుని ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. ఎస్ఐ గోపాలరావు మాట్లాడుతూ, సాటి మనిషికి సహాయం చేసే అలవాటు అలవర్చుకోవాలన్నారు. జడ్పిటిసి శెట్టి రోషిని ఆలపించిన ప్రత్యేక క్రిస్మస్ గీతం అందర్నీ ఆకట్టుకుంది. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు ప్రసాద్ పాల్, పి.సద్రక్, సంజీవ్ కుమార్, ప్రభుదాస్ ప్రభుదాస్, ప్రదీప్, విజయ్ డానియల్ మోడీ, సామూయేలు, జాన్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న పాల్ ఇమ్మానుయేలు

హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయితీ డొంకినవలసలో ప్లార్ దావీదు ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆనంద్ పాల్, శామ్యూల్,పీటర్‌లు క్రిస్మస్ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండలరావు, గన్నేరు పుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, స్థానిక సంఘ కాపరి డుంబేరి మల్లన్న, వార్డు మెంబర్‌లు వలసనైని వంశీ, మజ్జి రాజారావు, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్ డుంబేరి సురేష్ పాల్గొన్నారు.

మీడియాపై దాడులను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన విలేకర్ల సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని అడ్డారిమెట్ట బ్రిడ్జి వద్ద ఆంధ్ర ప్రదేశ్ గిరిజన విలేకరుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి వనభోజన కార్యక్రమం నిర్వహించారు. 11 మండలాల్లో పనిచేస్తున్న విలేకరులు హాజరయ్యారు. పి.దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు విలేకర్లు మాట్లాడుతూ, నిత్యం వార్తలు సేకరించడంలో బిజీగా ఉండే విలేకర్లు ఒక్క రోజు మనసు ప్రశాంతత కోసం ఆత్మీయ కలయిక వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా అనందాయకమన్నారు.విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యలు, మీడియాపై దాడులను సమిష్టిగా ఉండి పోరాటం చేయాలన్నారు. అందరూ ఐక్యతతో కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి మీడియా మిత్రులు పాల్గొన్నారు.

బయోమెడికల్ రంగంలో ఎన్ఎమ్ఆర్ కీలకం

ప్రజాశక్తి -మధురవాడ : వైద్య రంగంలో ముఖ్యంగా బయోమెడికల్ రంగంలో ఎన్ఎమ్ఆర్ (న్యూక్లియర్ మాగ్నెటిక్ రిసోనెన్స్) సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని లక్నోకు చెందిన సెంటర్ ఆఫ్ బయోమెడికల్ రీసెర్చి నిపుణులు వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యాన గురువారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఫార్మాసూటికల్, బయోమెడికల్ రంగాలలో ఎన్ఎమ్ఆర్ ప్రయోజనాలపై నిపుణులు ప్రసంగించారు. సెంటర్ ఆఫ్ బయోమెడికల్ రీసెర్చి నిపుణుడు ప్రొఫెసర్ నీరజ్ సిన్హా మాట్లాడుతూ, ఎన్ఎమ్ఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో ఎముకల సూక్ష్మ పరిశీలన, గాల్‌బ్లాడర్‌లో కేన్సర్ ప్రగతి, శరీరంలోని ద్రవాలలో మార్పులను ఖచ్చితంగా గుర్తించడం, బయోమార్కర్ల పరిశీలన సాధ్యపడుతుందన్నారు. ఎన్ఎమ్ఆర్ స్పెక్ట్రోస్కోపి, 2డి ఎన్ఎమ్ఆర్ పరిజ్ఞానం వంటివి ఔషధ, బయెమెడికల్ పరిశోధనలకు ఉపయోగపడతాయని తెలిపారు. మరో నిపుణుడు ప్రొఫెసర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్ఎమ్ఆర్ సహయంతో ప్రోటీన్ల అధ్యయనం వాటి క్రియాశీలతను లోతుగా పరిశోధించడం సాధ్యపడుతుందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాష్ గీతంలో పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గీతం విశిష్ట ప్రొఫెసర్ ప్రొఫెసర్ బివిఆర్ టాటా మాట్లాడుతూ, దాదాపు రూ.60 కోట్లతో ఎన్ఎమ్ఆర్ వంటి అధునాతన పరికరాలతో గీతం మూర్తి ప్రయోగశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు వీటిని ఉపయోగించుకుని దేశం గర్వించ తగ్గ పరిశోధనలు చేపట్టాలని కోరారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కన్వీనర్ ప్రొఫెసర్ జగదీష్ భరతం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ గిరిజన యువజన సమ్మేళనం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం విశ్వ విద్యాలయం వేదికగా వారం రోజులు పాటు జరిగిన 16వ జాతీయ గిరిజన యువజన సమ్మేళనం గురువారంతో ముగిసింది. ఎన్‌వైకె విశాఖ ఉమ్మడి జిల్లాల అధికారి గొర్లె మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముగింపు ఉత్సవంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు ఆన్సుమన్ దాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఒడిశాలోని కలహండి జిల్లా విద్యార్థులకు ప్రథమ బహుమతి లభించింది. అదే రాష్ట్రం నుంచి కాందమల్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. చత్తీస్‌గడ్ నుంచి మొహల్లా - మాన్పూర్ మూడవ స్థానంలో నిలవగా బస్తర్, కాంకర్ జిల్లాలు కన్సులేషన్ బహుమతి గెలుచుకున్నాయి. వక్తృత్వ పోటీలలో ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లాకు చెందిన జర్నపాత్ర విజేతగా నిలిచారు. మొహల్లా నుంచి నీలేష్ కుమార్, కాందమల్ జిల్లా నుంచి పనుగల్ దిగల్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. కలహండి నుంచి ప్రమోద్ హారిజన్, మొహల్లా నుంచి ఉమాభారతి కాన్సులేషన్ బహుమతులు సాధించారు. విజేతలకు అతిథులు జ్ఞాపికలను అందజేశారు. 16వ యువ సమ్మేళనంలో పాల్గొన్న యువతీ యువకులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హోమ్ మంత్రిత్వ శాఖ సెక్షన్ ఆఫీసర్ దినేష్ కుమార్ మీనా, ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర సింగ్, గీతం విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్వీజీ.రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంసుద్దీన్, కడప ఎన్‌వైకెయు అధికారి కె.మణికంఠ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ క్రమబద్ధీకరణ విభాగం సలహాదారు కాండ్రేగుల వెంకటరమణ, న్యాయవాది బి.రామకృష్ణ, ఎన్‌యుజెఐ జర్నలిజం స్కూల్ వైస్ చైర్మన్ ఎన్.నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

అవంతిలో 'జ్ఞాన్ -2 కె 24'

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో 'జ్ఞాన్ -2 కె 24' టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతిక నైపుణ్య కార్యక్రమాలు, పోస్టర్ ప్రెజెంటేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సాంకేతిక క్విజ్, టెక్నికల్ యాక్టివిటీస్ తదితరాలు టెక్ ఫెస్ట్‌లో ఉంటాయని వివరించారు. వినూత్న ఆలోచనలను వ్యక్త పరిచేందుకు, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు టెక్ ఫెస్ట్ వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం ఈ సాంకేతిక సదస్సుల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.


అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న చిన్నయ్య పడాల్, తదితరులు

బిటి రోడ్డు పనులు చేపట్టకపోతే దిగ్బంధం

ప్రజాశక్తి - సీలేరు: ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు బిటి రోడ్డు పనులు చేపట్టి జనవరిలోగాపూర్తిచేయకుంటే రోడ్డు దిగ్బంధం చేస్తామని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. గురువారం ఆర్‌వి నగర్, లంక పాకల మీదుగా సీలేరు వెళ్లే రహదారిని కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బోనంగి. చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఆర్ వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి అస్తవ్యస్తంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో వరదలకు లంక పాకల, చప్పర్ల దారకొండ ఘాట్ రోడ్డు కొట్టుకుపోయి అధ్వాన స్థితికి చేరుకోగా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నూతన రోడ్డు నిర్మాణానికి రూ33కోట్లు మంజూరు చేసినా ఇంకా పనులు మొదలుపెట్టలేదన్నారు. మండలంలోని 30గ్రామాల గిరిజనుల రాకపోకల కష్టాలను దృష్టిలో పెట్టుకుని మంజూరైన నిధులతో వెంటనే పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు, ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా నాయకులు గడుతురి సత్యనారాయణ సోమలింగం పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - సీలేరు: గంజాయి సాగు, అక్రమ రవాణాకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పిల్లిగెడ్డ గ్రామాన్ని గురువారం ఎస్ఐ రవీంద్ర సిబ్బందితో సందర్శించారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, సాగుకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి స్మగ్లర్లకు సహకరించినా జైలుపాలు కాక తప్పదని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని హితవుపలికారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, హెల్మెట్‌ధారణతోపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు నేరమని అటువంటి కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మొబైల్‌ఫోన్లలో వచ్చే అపరిచిత లింక్‌లు, యాప్‌లు తెరవరాదన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ సివిల్ పోలీసులు పాల్గొన్నారు

అక్రమ నిర్మాణాలను అరికట్టండి

ప్రజాశక్తి రంపచోడవరం : అడ్డతీగల మండలంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు కడుతున్న అక్రమ కట్టడాలను తక్షణమే నిలుపుదల చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవికి ఆదివాసీ సంక్షేమ పరిషత్' రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు మోడిద. నూకరాజు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంతోపాటు డి.భీమవరం, దుప్పులపాలెం గ్రామాల్లో గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, దీనిపై గ్రామపంచాయతీ, తహశీల్దార్, సబ్‌కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేశామని, అయినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షురాలు బోరగ. ఎర్రమ్మ, కురసం. వరలక్ష్మి, అడ్డతీగల మండల అధ్యక్షురాలు కారు. అరుణ కుమారి, పీఠ. ప్రసాద్,పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మండలంలోని కుండాడ పాఠశాల విద్యార్థులకు స్థానిక జనసేన పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో పెన్నులు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్సులు, బిస్కెట్స్ గురువారం హెచ్ఎం వెంకట్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొవ్వాసి బాబురావు, గణేష్, విజయ్, కెజ్జల విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రకృతి ఆధారిత పంటలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్ కోరారు. మద్దిలపాలెంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆర్గానిక్ మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు మేళా జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎంఎల్ఎ వెలగపూడి రామకృష్ణ బాబు, రైతు సాధికారత సంస్థ రాష్ట్ర థీమేటిక్ లీడర్ బి.ప్రభాకర్, శాసనమండలి మాజీ సభ్యులు పివి.మాధవ్, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పిఎల్ఎన్.రాజు, జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గిరిజన్ భవన్ స్టాల్

ఆర్గానిక్ మేళాలో గిరిజన భవన్ స్టాల్ ఆకట్టుకుంది. పాడేరుకు చెందిన రైతులు కృష్ణారావు, శశి ప్రియలు గిరిజన మహిళా కో - ఆపరేటివ్ సొసైటీ సహకారంతో సన్ గ్రీన్ సిఇఒ డాక్టర్ కె.శ్రుతి ఆధ్వర్యంలో స్టాల్ నెంబర్ 130ని పెట్టి గిరిజన ఉత్పత్తులైన గుమ్మడి, అల్లం, పచ్చి పసుపు, చిక్కుడు పిక్కలు, బీన్స్, పసుపు మొదలగు వాటిని అమ్మకానికి ఉంచారు.

విద్యార్థులకు ఎస్‌బిఐ జీరో అకౌంట్స్

ప్రజాశక్తి-దేవీపట్నం: మండలంలో కోరుకొండ స్టేట్ బ్యాంక్ ఆదేశాలతో ఇందుకూరుపేట గ్రామంలో విద్యార్థులకు జీరో అకౌంట్స్ ఉచితంగా అందజేసినట్లు బిసి పాయింట్ కరస్పాండెంట్, బూరుగు రంగ వేణి, తెలిపారు. కొత్తవీధి, లోతు పాలెం ఇందుకూరుపేట, తదితర గ్రామాల్లో బిసి పాయింట్ కరస్పాండెంట్, రంగ వేణి, పర్యటించి స్కూల్స్ హెచ్ఎం, టీచర్స్‌తో మాట్లాడి..విద్యార్థులకు అవసరమైన జీరో అకౌంట్. ఉచితంగా చేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రతి స్కూల్లో విద్యార్థులకు జీరో అకౌంట్‌పై .ఉపాధ్యాయులు, అవగాహన కల్పించి జీరో అకౌంట్ చేయించాలని కరస్పాండెంట్ రంగవేణి కోరారు.

యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -సీలేరు: స్థానిక ఉమామహేశ్వర ఆలయంలో యాగశాల నిర్మాణానికి గురువారం ఆలయ ప్రాంగణంలో కిరాణా వ్యాపారి వానపల్లి అప్పారావు దంపతులు శంకుస్థాపన చేశారు. ఎపి జెన్‌కో పంపు స్టోరేజ్ ప్రాజెక్ట్ ఎస్ఇ (సివిల్) చంద్రశేఖర్ రెడ్డి, ఇఇ జి. భాస్కరరావు ఎడిఇ టి.అప్పలనాయుడు పాల్గొనగా, . స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు ధనుంజయశాస్త్రి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు డి. నాగేష్, ఎపి జెన్‌కో డిస్ట్రిబ్యూషన్ ఫోర్‌మెన్ లామా ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్‌చ కాంగ్రెస్ నాయకులు కారే. శ్రీనివాస్, బాలాజీ లాడ్జి ఓనర్ నక్కా జ్ఞానేశ్వర్‌రావు దంపతులు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యదర్శి విష్ణు కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి సామగ్రి వితరణ

ప్రజాశక్తి -రంపచోడవరం : పిజెఎస్ పాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్టీఫెన్‌పాల్ ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్‌టి బాలుర హాస్టల్‌కు పలు సామగ్రిని అందజేశారు.ఏరియా ఆసుపత్రి భవనానికి రూ.15 లక్షలు విలువైన సామగ్రిని సూపరింటెండెంట్‌కు అందించారు.రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గిరిజన బాలుర హాస్టల్‌కు రూ.ఏడు లక్షలు విలువైన సామగ్రి ఇచ్చారు. నిరుపేదలకు నిత్యవసరాలు పంపిణీ చేశారు.

బోర్నగూడెంలో సెమీక్రిస్మస్ సందర్భంగా 500 మంది ఫాస్టర్లకు బట్టలు పంపిణీ చేశారు. రంపచోడవరం, చుట్టు పక్కల ప్రాంతాలలోని చర్చిలను దర్శించి , ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో బ్రదర్ ప్రవీణ్,సోజు ప్రకాష్, కిషోర్,జాన్, రోహిణి, ముఖర్జీ పాల్గొన్నారు.

రైతన్నల్లో అల్పపీడనం గుబులు

ప్రజాశక్తి - సీలేరు: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో మరొక రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో గిరిజన రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.ప్రస్తుతం ఖరీఫ్ వరిపంట కోతకు సిద్ధంగా ఉండడంతో ముందుకు వెళ్లలేక రైతులు ఇబ్బందులు పడుతన్నారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొమ్ములువాడ, బంధ వీధి రాళ్లగడ్డ, కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ, సంత నేరేడుపల్లి, జి. నేరేడుపల్లి, నిమ్మచెట్టు, హరిపురం తదితర గ్రామాల్లో వరి పంట ఎర్రబారి కోతకు సిద్ధంగా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసినా, గాలులు వీచినా పంటకు నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోసిన వరిచేనును భద్రపరుచుకోవడం రైతులకు ఇబ్బందికరంగా ఉంది. అలాగని కోయకుండా ఊరుకుంటే, వర్షాలు, గాలులతో చేను నేలవాలితే నష్టతీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అకాలవర్షాలుతో జరిగిన నష్టం రైతన్నలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.


గొరిలోవ సమీపంలో పొలాల్లో ఉన్న వరి పనలు


ఆధారాలు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

అక్రమాలకు కేరాఫ్‌గా ఎమ్మెల్యే భర్త!

ప్రజాశక్తి-రంపచోడవరం : తాము చెప్పిన పనులు చేయకుంటే అధికారుల ఇళ్లల్లో గంజాయి పెట్టి పట్టిస్తామని కూటమి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి భర్త భాస్కర్ అధికారులను బెదిరిస్తున్నారని, వారు తమ వద్దకు వచ్చి తమ బాధను వెల్లడించారని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆరోపించారు. గురువారం స్థానిక సినిమా హాల్ సమీపంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి తన స్వప్రయోజనాల కోసం పనిచేస్తున్నారన్నారు ఎమ్మెల్యే భర్త అధికారంలోకి రాకముందే ఉద్యోగాలిస్తామని లక్షల్లో వసూలు చేసి మోసం చేశారని, దానికి సంబంధించిన ఫోన్‌పే చెల్లింపులు ,ఇతర ఆధారాలున్నాయన్నారు. గిరిజన ప్రాంతంలో పేకాట గుండాట రికార్డింగ్ డాన్సులు నిర్వహించడంలో ఎమ్మెల్యే భర్త భాస్కర్ ఆరితేరిపోయాడని, 2022లో అనంతగిరి గ్రామంలో రికార్డింగ్ డాన్స్ వేయించిన వ్యవహారంలో అతనిపై ఎ1గా కేసు ఉందన్నారు అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామ సమీపంలో ఇసుక ర్యాంపును ఎమ్మెల్యే, అతని భర్త ఫ్లెక్సీలతో కూటమి నేతలు ఆర్భాటంగా నిర్వహిస్తూ, వైసిపిపై బురద చల్లుతున్నారన్నారు నిమ్మలపాలెంలో అక్రమ రంగురాళ్ల తవ్వకాలు మళ్లీ తెరిచేందుకు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే భర్త మరల ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఇళ్లు నిర్మించిన గిరిజనేతరులపై ఎల్‌టిఆర్ కేసులు పెడతామని అక్రమవసూళ్లకు పాల్పడుతున్నారని, డ్వాక్రా మహిళల నగదును తన ఖాతాలోకి ఎమ్మెల్యే భర్త మార్పచేయించాడని ఆరోపిచారు. బదిలీల్లోనూ దందా చేస్తూ స్థానాన్ని బట్టి రూ.ఐదు లక్షల నుంచి రూ.15లక్షల వరకు ముడుపులు దండుకుంటున్నారని ఆరోపించారు. నిరుపేదనంటున్న ఎమ్మెల్యేకు అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే లగ్జరీ కార్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు సమావేశంలో రంపచోడవరం జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి రామకృష్ణ , ఎంపిపి శ్రీదేవి,దేవీపట్నం ఎంపిపి మురళి,పార్టీ అధ్యక్షులు రామన్న దొర, రాజవొమ్మంగి ఎంపిపి వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శి వెంకటేష్ రాజు, గంగవరం జడ్పిటిసి బేబీ, పల్లాల కృష్ణారెడ్డి, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కారు దగ్ధం కేసులో వీడిన మిస్టరీ

ప్రజాశక్తి-చింతూరు : ఈ నెల 10న అల్లూరి జిల్లా చింతూరు మండలం సరివెల, కొత్త కొత్తూరు గ్రామాల నడుమ జాతీయ రహదారిపైకారు దగ్ధం కేసులో మిస్టరీ వీడింది.ఈ గురువారం చింతూరులోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా వివరాలు వెల్లడించారు.మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో కనస్ట్రక్షన్‌లో ఉన్న బ్రిడ్జి వద్ద మహేంద్ర జైలో కారు దగ్ధం ఘటనలో పలు అనుమానాలు రేకెత్తగా ఎస్‌పి అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ఒఎస్‌డి పంకజ్ కుమార్ మీనా పర్యవేక్షణలో చింతూరు సిఐ తెల్లం దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్ మూడు బృందాలుగా ఏర్పడి ముమ్మర దర్యాప్తు అనంతరం ముగ్గురు ముద్దాయిలను పట్టుకున్నారు. యటపాక మండలం నెల్లిపాక గ్రామానికి చెందిన గుంటుపల్లి మనోజ్ కుమార్, చెక్కా గణేష్ చింతూరు మండలం పేగ గ్రామానికి చెందిన సోడే నాగయ్య దగ్గర టేకు దిమ్మెలను కొనుగోలు చేసి అక్రమంగా కారు లో తరలిస్తుండగా బ్రిడ్జి సమీపానికి వచ్చిన తర్వాత కారు ఆపి కారులో సిగరెట్ తాగుతుండగా అప్పటికే కారులో బాటిల్స్‌లో ఉన్న పెట్రోల్ లీకై దగ్ధమైందన్నారు. టేకు దిమ్మల అక్రమ వ్యాపారం బాగోతం బయటపడుతందనే భయంతో వారు పరారయ్యారన్నారు. కేసు దర్యాప్తు అనంతరం వారిపై ప్రాథమికంగా నేరం నిర్ధారణ కావడంతో పట్టుకున్నామని, అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. నిందితుల నుంచి ఆటో,మోటార్ సైకిల్, కాలిపోయిన కారు మూడు సీట్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎఎస్‌పి వెల్లడించారు.

వృద్ధులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి -సీలేరు: మండలంలోని భీమవరం గ్రామంలో వృద్ధులకు మనం సేవా సొసైటీ వ్యవస్థాపకులు పేదిరెడ్ల గౌతం గురువారం నిత్యవసర సరుకులు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏదో ఒక గ్రామంలో వృద్ధులకు ప్రతినెలా నిత్యవసర సరుకులు అందజేస్తున్నామన్నారు.